గుబులు పుట్టిస్తున్న 'మొంథా'

● నేడు తిరువళ్లూర్ జిల్లాకు

ఆరెంజ్ అలర్ట్



ఎగసిపడుతున్న అలలు

● చెన్నై సహా 8 జిల్లాలకు భారీ వర్షసూచన ● తొమ్మిది హార్బర్లలో 2వ నెంబరు తుఫాన్ హెచ్చరిక

● 'ఈశాన్యం'తో 57 శాతం అదనపు వర్షపాతం నమోదు ● నేడు నాలుగు జిల్లాల్లో విద్యాలయాలకు సెలవు

చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్‌ను వణికిస్తున్న 'మొంథా' తుఫాన్.. తమిళనాడులో గుబులు పుట్టిస్తోంది. దీని తీవ్రత భారీగా వుంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో. ఎటు నుంచి ఎటు వెళ్తుందోనని రాష్ట్ర ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇదిలా వుండగా తుఫాను కారణంగా భారీ వర్షం పడే అవకాశముండడంతో మంగళవారం తిరువళ్లూర్ జిల్లాకు ఆరంజ్ అలర్ట్ ప్రకటించారు. కాగా చెన్నై సహా 8 జిలాల్లో భారీవర్షం పడే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం డీడీజీఎం డాక్టర్ పి.అముద తెలిపారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మొంథా తుఫాను కారణంగా తిరువళ్లూర్ జిల్లాల్లో మంగళవారం అతి భారీవర్షాలు, చెన్నై, రాణిపేట, కాంచీపురం, చెంగల్పట్టు, తేని, తెన్‌కాశి, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. రాష్ట్రంలో ఈ నెల 1వ తేది నుంచి సోమవారం వరకు 57 శాతం అదనపు వర్షపాతం నమోదైందని, 18 జిల్లాల్లో సాధారణం కన్నా అదనపు వర్షపాతం నమోదైందని వివరించారు. రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 144 మి.మీ కాగా, ప్రస్తుతం 227 మి.మీ వర్షపాతం నమోదైందని డైరెక్టర్ అముద తెలిపారు.

ఆరు రోజుల్లో 4.9 లక్షల మందికి ఆహారం...

జీసీసీ పరిధిలో ఈ నెల 22 నుంచి 27వ తేది వరకు 4,09,650 మందికి ఆహారం అందజేసినట్టు జీసీసీ ప్రకటన విడుదల చేసింది. వర్షపు నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో 2వేల మోటారు పంపులు ఏర్పాటుచేసి, ఎప్పటికప్పుడు నీరు తొలగించేలా ఏర్పాటుచేశామన్నారు. అలాగే, చెట్లు కూలితే వాటిని తొలగించేందుకు 457 యంత్రాలు సిద్ధం చేశామన్నారు. నగరంలోని 22 సబ్‌వేల్లో వర్షపు నీరు చేరకుండా 24 గంటలు పర్యవేక్షిస్తున్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో నెలకొన్న వరద సమస్యలపై '1913' నెంబరుకు ఫిర్యాదు చేయాలని జీసీసీ తెలియజేసింది.

తొమ్మిది హార్బర్లలో తుపాను హెచ్చరికలు

'మొంథా' తుఫాన్ కారణంగా రాష్ట్రంలోని 9 హార్బర్లలో సోమవారం 2వ నెంబరు ప్రమాద హెచ్చరిక జారీచేశారు. రెండు రోజుల క్రితం ఏర్పడిన అల్ప పీడనం బలపడి వాయుగుండంగా మారిన నేపథ్యంలో, ఆదివారం హార్బర్లలో 1వ ప్రమాద హెచ్చరిక జారీచేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో, వాయుగుండం తుఫాన్‌గా మారడంతో, చెన్నై, కడలూరు, ఎన్నూర్, కాట్టుపల్లి, పుదుచ్చేరి, కారైక్కాల్, నాగపట్టణం, పాంబన్, తూత్తుకుడి తదితర హార్బర్లలో 2వ తుఫాను ప్రమాద హెచ్చరికలు జారీచేశారు.



పట్టినంబాక్కంలో తీరానికే పరిమితమైన పడవలు

తీరానికే పరిమితమైన పడవలు...

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో చెన్నై, రామనాథపురం సహా పలు జిల్లాల్లో జాలర్లు చేపల వేటకు వెళ్లలేదు. బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుఫాన్ కారణంగా సముద్రంలో వాతావరణం అల్లకల్లోలంగా ఉంటూ 50 నుంచి 70 కి.మీ వేగంతో గాలులు వీచే ప్రమాదముందని వాతావరణ కేంద్రం హెచ్చరించిన క్రమంలో జాలర్లు సోమవారం కూడా చేపల వేటకు వెళ్లకపోవడంతో పడవలు తీర ప్రాంతాలకే పరిమితమయ్యాయి.

నేడు సెలవు

భారీ వర్షాల కారణంగా చెన్నై, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కడలూరు జిల్లాల్లో విద్యాలయాలకు ఆయా జిల్లాల కలెక్టర్లు మంగళవారం సెలవు ప్రకటించారు.

చెన్నైలో భారీవర్షం...

నగర వ్యాప్తంగా సోమవారం తెల్లవారుజాము నుంచే భారీవర్షం కురిసింది. ఎగ్మూర్, చెట్‌పెట్, కీల్పాక్కం, నుంగంబాక్కం, వెస్ట్ మాంబళం, టి. నగర్, గిండి, కోడంబాక్కం, వడపళని, తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. కోడంబాక్కం వెళ్లాలర్ వీధి, వడపళని పెరియార్ రోడ్డు, కుమరన్ కాలనీ మెయిన్ రోడ్డు, కేకే నగర్ పీటీ రాజన్ రోడ్డు, సత్య గార్డన్ తదితర ప్రాంతాల్లో నీరు చేరడంతో వాహన చోదకులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. అలాగే, జీఎస్‌టీ రోడ్డు ఆలందూర్ కోర్టు నుంచి శాంతి పెట్రోల్ బంక్ వరకు గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆదంబాక్కం ప్రాంతంలోని సెయింట్ థామస్ మౌంట్ సబ్ వే సమీపంలోని డ్రైనేజీలో లీకేజీ ఏర్పడి వర్షపు నీటిలో మురుగునీరు కలసి సబ్‌వేలో ప్రవహించింది.



రోడ్‌షోలపై విధివిధానాలను

10 రోజుల్లో సమర్పించండి

● రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వు



చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయ పార్టీలకు సంబంధించిన సభలు, ర్యాలీలు, రోడ్‌షోలకు సంబంధించి నూతన విధివిధానాలను రూపొందించి పదిరోజుల్లో సమగ్రమైన నివేదికగా సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. కరూర్‌లో టీవీకే నేత విజయ్ రోడ్‌షో నిర్వహించడానికి ముందు రోడ్‌షోలకు పోలీసులు కఠిన నిబంధనలు విధిస్తున్నారని, ఇతర పార్టీలకు ఎలాంటి కఠిన నిబంధనలు విధించడం లేదని పేర్కొంటూ హైకోర్టులో ఆ పార్టీ తరఫున ఓ పిటిషన్ దాఖలైంది. టీవీకే రోడ్‌షోలకు కఠిన నిబంధనలు లేకుండా అనుమతిచ్చేలా పోలీసులకు ఆదేశించాలని ఆ పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై సింగిల్ జడ్జి విచారణ జరుపుతున్నారు. ప్రస్తుతం ఆ పిటిషన్ హైకోర్టు ప్రథమ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. రోడ్‌షోలకు సంబంధించి ప్రభుత్వం కొత్త విధివిధానాలను రూపొందించేందుకు చర్యలు చేపడుతోందని, ఆ విధివిధానాలు రూపొందించేంతవరకు మాత్రమే రాష్ట్రంలో ప్రస్తుతం రోడ్‌షోలను ప్రభుత్వం అనుమతించడం లేదని ప్రభుత్వ తరఫు న్యాయవాది రవీంద్రన్ కోర్టుకు తెలిపారు. ఆ సందర్భంగా న్యాయమూర్తులు జోక్యం చేసుకుంటూ కొత్త విధివిధానాలు రూపొందించేంతవరకూ రోడ్‌షోలను అనుమతించకపోవడం రాజకీయ పార్టీల ప్రాథమిక హక్కులను భంగం కల్పించడమవుతుంది కదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ తరఫు న్యాయవాది బదులిస్తూ రాజకీయ పార్టీలు రోడ్‌షోలను జరుపు కునేందుకు మాత్రమే ప్రభుత్వం ఆంక్షలు విధించిందే తప్ప బహిరంగ సభలు, ర్యాలీలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదన్నారు. ఆ వాదనతో సంతృప్తి చెందిన న్యాయమూర్తులు రాజకీయ పార్టీల రోడ్‌షోలకు సంబంధించిన విధివిధానాలను పది రోజుల్లోగా ఖరారు చేసి తమకు నివేదిక సమర్పించాలని ఆదేశించి, ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 11వ తేదీకి వాయిదా వేశారు.

రాష్ట్రంలో మళ్లీ డీఎంకే పాలనే

● ఓపీఎస్ జోస్యం

చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షాల మధ్య ఐకమత్యం లేకపోవడం వల్ల మళ్లీ డీఎంకే ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) జోస్యం చెప్పారు. శివగంగ జిల్లా కాళయార్‌కోవిల్‌లోని స్వాతంత్ర్య సమర యోధులు మరుదుపాండియర్ స్మారక స్థలంలో గురుపూజ సందర్భంగా సోమవారం నివాళులర్పించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సంగ్రామంలో మరుదుపాండియర్ల త్యాగం ప్రపంచఖ్యాతి పొందిందని, తన తరఫున మరుదు పాండియర్ల విగ్రహానికి రజత కవచాన్ని కానుకగా సమర్పించానని తెలిపారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షాలన్నీ విడివిడిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నాయని, ఆయా పార్టీల మధ్య ఐకమత్యం కొరవడిందని, అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగితే డీఎంకే సునాయాసంగా మళ్లీ అధికారంలోకి వస్తుందని ఓపీఎస్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లోగా అన్నాడీఎంకే నుంచి విడిపోయినవారంతా మళ్లీ విలీనం కావాలనే తాను కోరుకుంటున్నానని చెప్పారు. పార్టీ కార్యకర్తల ద్వారానే పార్టీ ప్రధాన కార్యదర్శిని ఎంపిక చేయాలని అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ నిబంధన అమలు చేశారని, దానిని ఈపీఎస్ తోసిపుచ్చి కొత్త సవరణలు చేసి పది మంది జిల్లా కార్యదర్శుల చేత ప్రతిపాదించుకుని పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి చేపట్టారని ఓపీఎస్ ఆరోపించారు. ఈ విషయమై తాము కోర్టులో పిటిషన్ వేశామని, ప్రస్తుతం ఈ కేసులో తుది తీర్పు కోసం వేచి ఉంటున్నామని తెలిపారు.

విద్యార్థులు

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

భారతీదాసన్ వర్సిటీ స్నాతకోత్సవంలో సీఎం స్టాలిన్ పిలుపు



విద్యార్థినికి పట్టా ప్రదానం చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విశ్వ విద్యాలయాలు ప్రదానం చేసే పట్టాలు కేవలం కాగితాలు కావని, విద్యాభ్యాసంలో తాము పడిన శ్రమకు గుర్తింపుగా భావించి విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదిగి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. మ్యూజిక్ అకాడమీ హాలులో సోమవారం ఉదయం జరిగిన తిరుచ్చి భారతీదాసన్ విశ్వ విద్యాలయం 39వ స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఆ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఉన్నత విద్యలో రాష్ట్రం ముందంజలో ఉందని ఎన్ఐఆర్ఎఫ్ సంస్థ ప్రకటించిందని, పూర్వం విద్యకు దూరమైన బలహీనవర్గాలకు చెందినవారంతా డీఎంకే ప్రభుత్వం పాటిస్తున్న సామాజిక న్యాయం కారణంగా విద్యావంతులుగా ఎదుగుతుండట మేనన్నారు. విద్యార్థులు తాము చదివిన పాఠ్యాంశాల్లో వేగవంతం గా వస్తున్న మార్పులను గమనించాలని, లేకుంటే అవుట్ డేట్ అయిపోతారని హెచ్చరించారు. గతంలో వేగవంతమైన కంప్యూటర్ యుగమని చెబుతుండేవారమని, ప్రస్తుతం కృత్రిమ మేథోపరిజ్ఞాన యుగమని, ఈ విప్లవాత్మకమైన మార్పులను విద్యార్థులు గమ నించి తమ పాఠ్యాంశాలను తరచూ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు పట్టాలు పొంది ఉన్నత ఉద్యోగాలు సంపాదించినా, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగినా తాము చదివిన విశ్వ విద్యా లయాలను, తమ రాష్ట్రాన్ని మరచి పోకూడదని, రాష్ట్రాభివృద్ధి తమవంతు సహాయ సహకారాలు కూడా అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ స్నాతకోత్సవంలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి శంకర్, భారతిదాసన్ ఉన్నత విద్యా సంస్థల అధ్యక్షుడు రవి అప్పాసామి, శాసనసభ్యుడు డాక్టర్ ఎళిలన్, నిర్వాహక కమిటీ సభ్యుడు బాలభాస్కర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ జయకృష్ణా తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు భరోసా ఇస్తున్న విజయ్

మీకు అండగా ఉంటా

● కరూర్ మృతుల కుటుంబాలకు విజయ్ భరోసా

● మహాబలిపురం రిసార్ట్‌లో ప్రత్యేక భేటీ

చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గత నెలలో కరూర్ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటానని 'తమిళగ వెట్రి కళగం' అధ్యక్షుడు విజయ్ భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబీకులను వారిళ్లకే వెళ్లి పరామర్శించడానికి రాలేకపోయినందుకు తీవ్ర భావోద్వేగంతో క్షమాపణ అడిగారు. కరూర్‌లో రోడ్‌షో సందర్భంగా చోటు చేసుకున్న తొక్కిసలాటలో మృతి చెందిన 41 మంది కుటుంబ సభ్యులను, గాయపడినవారిని సోమవారం ఉదయం విజయ్ పరామర్శించారు. మహాబలి పురం సమీపంలోని పూంజేరి వద్దనున్న ఓ రిసార్ట్‌లో మృతుల కుటుంబీకులను, గాయపడినవారిని ఆయన ఓదార్చారు. కరూర్ నుండి ఐదు ఆమ్నీ బస్సుల్లో మహాబలిపురానికి రప్పించిన కుటుంబీకులందరినీ ఒక్కో గదిలో బస కల్పించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 8.30 గంటలకు విజయ్ ఆ రిసార్ట్ వద్దకు చేరుకున్నారు.



రిసార్ట్ వద్ద భద్రతా సిబ్బంది

పార్టీ ప్రముఖులతో కలిసి ప్రతి గదిలోకి వెళ్ళి మృతుల కుటుంబీకులను ఓదార్చారు. ఒక్కో కుటుంబానికి పావుగంట సమయాన్ని కేటాయించి విజయ్ వారిని పరామర్శించి నగదు కానుకలు అందజేశారు. ఇదే విధంగా గాయపడినవారికి తలా రూ.2లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. కరూర్ నుండి మహాబలిపురానికి రప్పించటంలో మృతుల కుటుంబీకులకు ఏర్పడిన అసౌకర్యానికి క్షమాపణలు చెప్పుకుంటున్నానని, జీవితాంతం తాను వారి కుటుంబంలో ఒకడిగా ఉంటానని, ఏ సహాయం కావాలన్నా ఏ సమయంలోనైనా తనను కలుసుకోవచ్చునని విజయ్ చెప్పారు. కరూర్ వచ్చి ఓదార్చాలని అనుకున్నా, భద్రతా కారణాలకు తోడు, కల్యాణమండపాలు లభించక పోవడం వల్లే తాను రాలేకపోయానని సంజాయిషీ ఈ సందర్భంగా ఇచ్చుకున్నారు.

జనవరిలో రాష్ట్రానికి రాహుల్, ప్రియాంక ?

● వేర్వేరుగా పాదయాత్ర చేపట్టాలని నిర్ణయం ● డీఎంకే కూటమిలో ఉత్సాహం



చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనాయకత్వం ముమ్మర ప్రచారం చేప ట్టాలని భావిస్తోందా?.. ఇందుకోసం ఆ పార్టీ అగ్రనేతలైన రాహుల్ గాంధీ, ప్రియాంకా నెల రోజుల పాటు రాష్ట్రంలో పాదయాత్ర చేపట్టనున్నారా?.. అవుననే అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు. ఇప్పటికే దీనిపై ఆ ఇద్దరు నేతలు ఒక నిర్ణయానికి వచ్చారని, వారి పాదయాత్రకు సంబంధించిన ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు పేర్కొ న్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో చావోరేవో తేల్చుకునేందుకు అన్నాడీఎంకే సిద్ధమవుతోంది. తమ పార్టీ అధినేత్రి జయలలిత లేకపోవడం, పార్టీ చీలికలుపేలికలు కావడం, ఇంటిపోరుతో సతమతమైపోతున్న ఆ పార్టీని గాడిన పెట్టేందుకు ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) తీవ్రంగా పోరాడుతున్నారు. అన్నాడీఎంకేతో జత కట్టిన బీజేపీ కూడా ఈసారి ఎన్నికలను ప్రతిష్మాత్మకంగా తీసుకుంది. ఇందుకోసం బీజేపీ అగ్రనేతలైన అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా వంటి వారితో పాటు ప్రధాని నరేంద్రమోదీ ప్రచార సభలు సైతం వుండేలా ప్రణాళిక రూపొందిస్తోంది. అదే సమయంలో అధికారాన్ని కాపాడుకునేందుకు డీఎంకే కూడా తమ వ్యూహాలకు పదును పెడుతోంది. ఇందులో భాగంగా బీజేపీ అగ్రనాయకత్వాన్ని ఢీకొనేలా కాంగ్రెస్ జాతీయ నేతలతో రాష్ట్రంలో ప్రచారం చేయించాలని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ భావిస్తున్నారు. ఆయన సూచన మేరకు కాంగ్రెస్ నేతలు దానికి అంగీకరించారు. అయితే సాదాసీదా ప్రచారం చేపడితే సరిపోదని, రాష్ట్రం మొత్తం పర్యటించాలని రాహుల్‌గాంధీ భావిస్తున్నారు. అంతేగాక తనతో పాటు తన సోదరి ప్రియాంకతో కూడా ప్రచారం చేయించడం మంచిదని రాహుల్ అభిప్రాయపడినట్లు సమాచారం. అయితే వారిద్దరూ కలిసి కాకుండా వేర్వేరుగా ప్రచారం చేపట్టనున్నారు. ఆ మేరకు కాంగ్రెస్ వర్గాలు రూట్ మ్యాప్ తయారు చేస్తున్నట్లు తెలిసింది. దీని గురించి ఆదివారం జరిగిన కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి సమావేశంలోనూ చర్చ జరిగినట్లు తెలిసింది. బీజేపీ అగ్రనాయకత్వ ప్రచారాన్ని తట్టుకునేందుకు రాహుల్, ప్రియాంకలే సరైన మార్గమని సమావేశంలో నేతలు అభిప్రాయపడినట్లు తెలిసింది.

తిరుచెందూరులో అట్టహాసంగా

శూరసంహార వేడుకలు

● పరవశించిన భక్తులు ● నేడు జయంతినాథర్ తిరుకళ్యాణం


చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం కుమారస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో రెండవది, స్వామివారు సైనిక దళంతో బసచేసిన సముద్రతీర క్షేత్రం తిరుచెందూరులో సోమవారం సాయంత్రం శూరసంహార వేడుకలు వైభవంగా జరిగాయి. సర్వాలంకరణ శోభితుడై, సకల ఆయుధాలను ధరించి శూరపద్ముడిని వధించేందుకు జయంతి నాథుడు (కుమారస్వామి) ఆలయానికి చేరువగా ఉన్న సముద్రతీర ప్రాంతానికి వేంచేశారు. సముద్రతీరంలో సాయంత్రం 4.30 గంటలకు జయంతినాథ స్వామి ఆగమనానికి జేజేలు పలుకుతూ సుమారు నాలుగు లక్షలమంది భక్తులు దారికిరువైపులా నిలిచారు. ఈ దివ్యక్షేత్రంలో ఈ నెల 22న యాగశాల పూజలతో ప్రారంభమైన స్కందషష్ఠి వేడుకల్లో ప్రధానమైన శూరసంహార వేడుకలు నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత 1.30 గంటలకు విశ్వరూప దర్శనం, రెండు గంటలకు ఉదయ మార్తాండ అభిషేకం, ఉదయం తొమ్మిది గంటలకు ఉచ్చికాల అభిషేకం, మధ్యాహ్నం ఒంటిగంటకు దీపారాధన నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆలయం నుండి శూరపద్ముడిని సంహరించేందుకు సర్వాలంకరణ శోభితుడైన జయంతినాథుడు సముద్రతీరానికి వేంచేశారు.

శూరపద్ముడి సంహారం...

పార్వతీపరమేశ్వరులు ఆశీర్వదించి ఇచ్చిన శూలాయుధంతో, భూతగణాలు, దేవగణాలను వెంట బెట్టుకుని, వాయుదేవుడు నడిపిన ప్రత్యేక రథంలో ఆసీనుడై జయంతినాథ స్వామి శూరపద్ముడిని వధించేందుకు కడలి తీరానికి చేరుకున్నారు. అక్కడ దేవదక్షుడు రూపొందించిన సైనిక శిబిరంలో స్వామివారు వేంచేశారు. ముందుగా తన సైన్యాధ్యక్షుడు వీరబాహుడిని శూరపద్ముడి చెంతకు రాయబారానికి పంపుతారు. కుమారస్వామితో పొత్తు పొసగదని యుద్ధం తప్పదని వీరబాహుడికి తెలిపి తిప్పిపంపుతాడు శూరపద్ముడు. ఈ పౌరాణిక ఘట్టాలను ఆలయ సిబ్బంది, స్థానిక యువకులు, అర్చకులు కలిసి రెండు బృందాలుగా ఏర్పడి ప్రదర్శించారు. ఆ తర్వాత కుమారస్వామికి, శూరపద్ముడికి మధ్య భీకర సంగ్రామం కొనసాగుతుంది. ఈ పోరులో శూరపద్ముడి కుమారులు బాణుగోపుడు, అగ్నిముఖాసురుడు, తమ్ముడు సింహముఖుడు తదితర సైనికులందరినీ కుమారస్వామి హతమార్చారు. అన్ని ఆయుధాలను ప్రయోగించిన తర్వాత చిట్టచివరి ఆయుధంగా కుమారస్వామి పార్వతీపరమేశ్వరులిచ్చిన శూలాయుధాన్ని శూరపద్ముడిపై ప్రయోగిస్తారు. ఆ శూలాయుధాన్ని చూసి భీతిల్లిన శూరపద్ముడు మామిడి వృక్షంగా మారాడు. ఆ శూలాయుధం ఆ వృక్షాన్ని రెండు ముక్కలుగా చీల్చటంతో. ఓ ముక్క కోడి పుంజుగా, మరో ముక్క నెమలిగా మారుతుంది. కోడిపుంజు కుమారస్వామి పతకంలో స్థానం సంపాదించగా, నెమలి స్వామివారికి వాహనంగా మారుతుంది. పురాణగాథల ప్రకారం జరిగిన ఈ ఘట్టాన్ని భక్తజనానికి ఆసక్తి కలిగించేలా తిరుచెందూరు సెందిల్ ఆండవర్ ఆలయ నిర్వాహకులు, పూజారులు, స్కందషష్ఠి వ్రతమాచరిస్తున్న భక్తులు ప్రదర్శించారు. సాయంత్రం 5.45 గంటలకు ఈ శూర సంహారఘట్టం వైభవంగా ముగిసింది. గంటపాటు జరిగే ఈ శూరసంహార ఘట్టాన్ని తిలకిస్తే సర్వపాపాలు తొలగిపోతాయనే విశ్వాసంతో దేశవిదేశాల నుండి లక్షలాది మంది భక్తులు హాజరయ్యారు. ఈ శూరసంహార ఘట్టాన్ని తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుండి కూడా భక్తులు తండోపతండాలుగా విచ్చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ నిర్వాహకులు, పోలీసులు, స్థానిక సంస్థల అధికారులు సంయుక్తంగా ఏర్పాట్లు చేపట్టారు. సుమారు నాలుగువేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. శూర సంహారం తర్వాత జయంతి నాథుడు, వళ్లిదేవి ఆలయం వద్దనున్న సంతోషమండపంలో కొలువుదీరారు. ఆ తరువాత జయంతి నాథుడు వళ్లి, దేవసేన సమేతంగా గిరి ప్రదక్షిణ చేసి ఆలయానికి చేరుకున్నారు. మంగళవారం స్వామి, అమ్మవార్లకు తిరుకల్యాణోత్సవం జరుగనుంది. ఈ వివాహవేడుక తిలకించిన తర్వాత భక్తులంతా స్కందషష్ఠి వ్రతాన్ని ముగిస్తారు.



సముద్రతీరంలో శూరసంహార ఘట్టాన్ని తిలకిస్తున్న భక్తులు



వడపళని ఆలయం వద్ద భక్తుల రద్దీ (ఇన్‌సెట్‌లో) స్వామివారు

వడపళనిలో...

వడపళని మురుగన్ ఆలయంలోనూ శూరసంహార వేడుకలు సోమ వారం సాయంత్రం నేత్రపర్వంగా నిర్వహించారు. ప్యారీస్ కార్నర్‌లోని కందకోట్టమ్ కందసామి ఆలయం, కుండ్రత్తూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, సిరువాపురం బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయం, వల్లకోట్టై మురుగన్ ఆలయం, తిరుప్పోరూర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, మైలాపూరు కపాలీశ్వరాలయ ప్రాంగణంలోని మురుగన్ ఆలయంలో శూరసంహార వేడుకలు ఘనంగా జరిగాయి. వడపళని ఆలయంలో సోమవారం వేకువజాము నుంచే భక్తులు వందల సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. పోలీసులు ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.



వడపళని ఆలయంలో ఆయుధాలు ధరించి శూరసంహారానికి సిద్ధమవుతున్న స్వామివారు

కలింజూర్ నుంచి అదనపు జలాల విడుదల

● జలమయమైన లోతట్టు ప్రాంతాలు





ఇళ్లలో చేరిన నీరు, కాలువను తలపిస్తున్న వీధి

వేలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొద్దిరోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. అలాగే జిల్లా సరిహద్దు ప్రాంతమైన ఆంధ్ర రాష్ట్రంలో కూడా వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలోకి నీరు ప్రవేశిస్తోంది. అదేవిధంగా కర్ణాటక రాష్ట్రంలోని పెద్దమంగళం జలాశయం నుంచి విడుదల చేస్తున్న అదనపు జలాలు కూడా పాలారు నదిలోకి చేరుకుంటున్నాయి. పాలారు నుంచి విడుదల చేస్తున్న నీరు కలింజూర్ చెరువుకు చేరుకోవడంతో అది పూర్తిస్థాయిలో నిండింది. దీంతో, అదనపు జలాలు దిగువకు విడుదల చేస్తున్నారు. కాలువల్లో పూడికతీత పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో, వరద నీరు లోతట్టు ప్రాంతాలకు చేరింది. గత ఏడాది వర్షాల సమయంలో కూడా ఇలాంటి పరిస్థితి నెలకొందని, ఈ ఏడాది అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ముందుగానే కాలువల్లో పూడికతీత చేపట్టి ఉంటే ముంపు సమస్య నుంచి బయడపడే అవకాశం ఉండేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రపంచ చరిత్రలో నాలాగా ఓడిన వారెవరూ లేరు

● ఎన్‌టీకే అధినేత సీమాన్



చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చరిత్రలో ఏ పార్టీతోనూ పొత్తుపెట్టుకోకుండా ఎన్నికల్లో పోటీచేసి తనలా ఓటమిపాలైన రాజకీయ నేతలెవరూ లేరని నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే) సమన్వయకర్త సీమాన్ అన్నారు. నగరంలోని సోమవారం ఉదయం జరిగిన ఓ వివాహ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా, ఏ కూటమిలోనూ చేరకుండా అన్ని పార్టీల కంటే ముందుగానే అభ్యర్థులను ఎంపిచేసి పోటీ చేయిస్తున్న ఏకైక పార్టీ తమదేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచ చరిత్రలో తమ మాదిరిగా ఎన్నికల్లో ఓటమిపాలైన రాజకీయ పార్టీ నేతలెవరూ లేరని, 2014 ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేసి 1.1 శాతం ఓట్లు సాధించి ఓడిపోయామని, తక్కువ ఓట్లతో ఓటమిపాలైన ఏ రాజకీయ పార్టీ బతికిబట్టకట్టదని, అయితే తాము మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసి 5 శాతం ఓట్లు పొందామని, ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో 7 నుంచి 8 శాతం ఓటు బ్యాంక్ సంపాదించుకున్నామని, ప్రస్తుతం 8.5 శాతం ఓట్లు సంపాదించుకుని కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా ప్రాంతీయ పార్టీగా గుర్తింపు పొందామని సీమాన్ వివరించారు.

ప్రభుత్వ బస్సును ఢీకొన్న బైక్: యువకుడి దుర్మరణం



కీర్తివాసన్ (ఫైల్‌ఫొటో)

తిరుత్తణి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో ప్రభుత్వ బస్సును బైక్ ఢీకొన్న ఘటనలో, బైక్ దగ్గం కావడంతో యువకుడు మృతి చెందాడు. తిరువలంగాడు యూనియన్ నల్లత్తూర్ గ్రామానికి చెందిన సురేష్‌బాబు కుమారుడు కీర్తివాసన్ (25) శ్రీపెరంబుదూర్ సమీపంలోని ఓ కర్మాగారంలో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. చెన్నై -తిరుపతి జాతీయ రహదారిలోని రఘునాథపురం బస్టాండ్ సమీపంలో తిరుత్తణి వైపు వెళ్తున్న బస్సును బైక్ ఢీకొంది. ఈ ఘటనలో బైక్ నుంచి కిందపడిన కీర్తివాసన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు అతడిని వెంటనే 108 అంబులెన్స్‌లో తిరువళ్లూర్ ప్రభుత్వా సుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, ఘటనలో బస్సు కింద చిక్కుకున్న బైక్ పెట్రోల్ ట్యాంక్ పేలిపోవడంతో మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు నీరు చల్లి ఆర్పివేయడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనపై కనకమ్మసత్రం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తిరుత్తణిలో అత్యధికంగా 50 మి.మీ వర్షపాతం

● జలమయమైన రోడ్లు





తిరుత్తణి ఆలయానికి వెళ్లే రోడ్డుపై చేరిన నీటిలో వాహన చోదకుల ఇక్కట్లు, రైల్వే ట్రాక్‌పై నిలిచిన నీరు

తిరుత్తణి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గడిచిన 24 గంటల్లో అత్యధికంగా తిరుత్తణిలో 50 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా తిరువళ్లూర్ జిల్లాలో ఆదివారం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం 8.30 నుంచి సోమవారం ఉదయం 5.30 గంటల వరకు 24 గంటల్లో అత్యధికంగా తిరుత్తణిలో 50 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆర్కాట్‌కుప్పం, కేజీ కండ్రిగై, కనకమ్మసత్రం, పొదటూరుపేట తదితర ప్రాంతాల్లోను భారీ వర్షం కురిసింది. తిరుత్తణి బైపాస్ రైల్వే సబ్‌వేలో వర్షనీటితో మురుగునీరు కలువడంతో వాహన చోదకులు, తిరుత్తణి ఆలయానికి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో 24 గంటల్లో జిల్లాకు భారీ వర్షాలుంటాయని వాతావరణ కేంద్రం హెచ్చరించడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టినట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది.



నడిరోడ్డుపై కారు దగ్ధం

చెన్నైలోని బిసెంట్ నగర్ సమీపంలో రోడ్డుపై వెళ్తున్న కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు భయాందోళన చెందారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. అదృష్టవశాత్తు కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు మంటలు వ్యాపించకముందే బయట పడడంతో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

- చెన్నై,ఆంధ్రజ్యోతి

రైలు ఢీకొని తండ్రి, కుమారుల దుర్మరణం

వేలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రైలుపట్టాలు దాటుతున్న తండ్రి, కుమారుడు రైలు ఢీకొని మృతిచెందారు. తంజావూరు ప్రాంతానికి చెందిన రాజేష్ (39), భార్య శోభ, కుమారులు కిషోర్, వాసులతో కలసి వేలూరు జిల్లా తిరువలం ప్రాంతంలో నివసిస్తున్నారు. కామరాజపురం రైల్వే ఫ్లై ఓవర్ సమీపంలో రాజేష్ చిన్న హోటల్ నడుపుతున్నాడు. ఈ నేపథ్యంలో, కామరాజపురం తిరువలం రైల్వేస్టేషన్ సమీపంలో ఘటన జరిగిన రోజున రాజేష్, కుమారుడు కిషోర్ (18) రైలు పట్టాలు దాటేందుకు యత్నించగా, ఆ సమయంలో వచ్చిన రైలు ఢీకొనడంతో ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న కాట్పాడి రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జయ పాలన తీసుకొస్తాం

● వీకే శశికళ

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్రంలో మళ్లీ జయలలిత పాలన తీసుకొస్తామని వీకే శశికళ తెలిపారు. తంజావూరులో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తంజావూరు, తిరువారూరు జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్ల సక్రమంగా చేపట్టలేదన్నారు. ధాన్యం తరలించేందుకు చేస్తున్న లారీల ఒప్పందంలో భారీ అవినీతి జరిగిందన్నారు. జయలలిత పాలనలో ఆయా జిల్లాల స్థాయిలోనే ఒప్పందం కుదుర్చుకుని విజయవంతంగా అమలుచేసినట్లు తెలిపారు. డీఎంకే పాలన ప్రకటనలకే పరిమితమైందన్నారు. ఇలాంటి ప్రభుత్వాని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

బస్సుల్లో గంజాయి తరలింపు 26 మంది మహిళల అరెస్ట్

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది బస్సుల్లో గంజాయి తరిలిస్తున్న 26 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు పోలీసు శాఖ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రం, పొరుగు రాష్ట్రాలకు చెందిన మహిళలు, ఆంధ్ర, ఒడిసా, మణిపూర్ తదితర రాష్ట్రాల నుంచి బస్సుల్లో గంజాయి తీసుకొస్తున్నారని తెలిపింది. గంజాయి తరలింపునకు సంబంధించి, ప్రతినెలా 30 మంది పురుషులు, ముగ్గురు మహిళలను అరెస్టుచేస్తున్నామన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు గంజాయి రవాణాకు సంబంధించి 375 కేసులు నమోదుచేసి, 289 మంది పురుషులు, 26 మంది మహిళలను అరెస్ట్ చేసి,. వారి నుంచి 4,407 కిలోల గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు శాఖ తెలిపింది.

తిరువిక నగర్ ఎమ్మెల్యేకు మాతృవియోగం



సౌందరి అమ్మాళ్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువిక నగర్ నియోజకవర్గం డీఎంకే శాసనసభ్యుడు తాయగం కవి మాతృమూర్తి పి. సౌందరి అమ్మాళ్ (97) సోమవారం ఉదయం కన్నుమూశారు. ఆమె మృతిపట్ల ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి సంతాపం ప్రకటించారు. సౌందరి అమ్మాళ్ అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం వెస్ట్‌మాంబళం తలయారి వీధిలో ఉన్న నివాసగృహంలో జరుగుతాయని, సాయంత్రం కన్నమ్మాపేట శ్మశానవాటికలో ఖననం జరుగుతుందని కుటుంబీకులు తెలిపారు.

జంట హత్యల కేసులో ఐదుగురికి రెండు యావజ్జీవ శిక్షలు

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌లో 2015లో జరిగిన జంట హత్యల కేసులో నిందితులు ఐదుగురికి ఏకకాలంలో రెండు యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం సోమవారం తీర్పు వెలువరించింది. మాంసం దుకాణంలో ఏర్పడిన గొడవ కారణంగా దుకాణ యజమాని మొయిద్దీన్ భాషా, హమీద్ మహ్మద్‌లు దారుణ హత్యకు గురయ్యారు. ఈ కేసు విచారణ ముగిసిన నేపథ్యంలో, ఈ కేసులో అరెస్టయిన సాధిక్ అలి, అక్బర్ అలి, మన్సూర్ అలి, జాకీర్ హుస్సేన్, అజారుద్దీన్‌లకు రెండు యావజ్జీవ జైలుశిక్ష విధిస్తూ జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది.

ఆనంద్, నిర్మల్‌కుమార్‌లకు సీబీఐ సమన్లు

● నేడు విచారణకు హాజరు

ప్యారీస్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాటపై మంగళవారం విచారణకు హాజరుకావాలని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, సంయుక్త ప్రధాన కార్యదర్శి నిర్మల్ కుమార్‌లకు సీబీఐ సమన్లు పంపింది. టీవీకే అధ్యక్షుడు విజయ్, గత నెల 27వ తేది కరూర్‌లో పాల్గొన్న రోడ్‌షోలో తొక్కిసలాట జరిగి 41. మంది మృతిచెందగా, 110 మంది గాయపడ్డారు. ఈ వ్యవహారంపై మాజీ న్యాయమూర్తి అరుణా జగదీశన్ నేతృత్వంలో విచారణ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. మరోవైపు హైకోర్టు ఉత్తర్వులతో ఐజీ ఆశ్రా గార్గ్ నేతృత్వంలో ఏర్పాటైన బృందం, ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ ప్రారంభించింది. కరూర్ జిల్లా టీవీకే కార్యదర్శి మదియళగన్, పౌన్‌రాజాలను కరూర్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదిలా ఉండగా, ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణకు వ్యతిరేకంగా టీవీకే సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ వేసింది. బాధితుల తరఫున సీబీఐ విచారణ కోరుతూ మరో పిటిషన్ కూడా దాఖలైంది. విచారణ జరిపిన న్యాయస్థానం, కరూర్ తొక్కిసలాట వ్యవహారాన్ని సీబీఐ విచారణకు అప్పగించింది. సీబీఐ కొద్దిరోజుల క్రితం కరూర్ న్యాయస్థానంలో ఎఫ్ఐఆర్ దాఖలుచేసింది. అందులో ఏ1గా మదియళగన్, ఏ2గా బుస్సీ ఆనంద్, ఏ3గా నిర్మల్‌కుమార్ పేర్లు చేర్చింది. ఈ కేసు విచారణ త్వరితగతిన పూర్తిచేయాలని సీబీఐ నిర్ణయించి మంగళవారం జరుగనున్న విచారణకు నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని బుస్సీ ఆనంద్, నిర్మల్ కుమార్‌లకు సమన్లు పంపింది.

బుస్సీ ఆనంద్‌కు ఉద్వాసన...?

టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్‌ను ఆ పదవి నుంచి తప్పించి, పుదుచ్చేరిలో పార్టీ బాధ్యతలు అప్పగించేలా అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. సినీ రంగంలో విశేష అనుభవం కలిగిన ఆదవ్ అర్జున్‌ను పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. పార్టీలో కీలక పదవులపై జరుగనున్న మార్పుల కారణంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్‌కు ప్రజల మద్దతు మరింత పెరిగే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో, విజయ్‌తో చాలా సంవత్సరాలుగా సన్నిహితంగా ఉన్న బుస్సీ ఆనంద్‌ను పార్టీ పదవి నుంచి తప్పించే అవకాశం లేదని, విజయ్ పార్టీ అంటేగిట్టని కొందరు ఇలాంటి వదంతులు పుట్టిస్తున్నారని టీవీకే వర్గాలు తెలిపాయి.

సమాచార దర్శిని

31న అష్టలక్ష్మి ఆలయ కుంభాభిషేకం

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసెంట్ నగర్‌లోని అష్టలక్ష్మి ఆలయ కుంభాభిషేకం ఈ నెల 31వ తేది జరుగనుంది. ఈ ఆలయంలో రూ.2 కోట్లతో గత ఏడాది ఫిబ్రవరి 15న జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించారు. పనులు పూర్తికావడంతో ఈ నెల 31వ తేది కుంభాభిషేకం నిర్వహించ నున్నారు. 31వ తేది ఉదయం 8.30 గంటలకు నుంచి మహా పూర్ణాహుతి, కలశాలను ఊరేగించి 9.30 నుంచి కుంభాభిషేకం నిర్వహించనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు తిరుకల్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నిరుద్యోగ భృతికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగావకాశాలు, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో, నిరుద్యోగ యువకులకు ప్రోత్సాహక వేతనం అందజేస్తున్నారు. ఈ పథకంలో, ఎస్ఎస్ఎల్సీ నుంచి డిగ్రీ పూర్తిచేసి, ఉద్యోగం రాని వారు, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లో ఐదేళ్లకు పైగా పేరు నమోదుచేసుకుని ఉండాలి. గిండిలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చు. దివ్యాంగులు, గిండిలోని దివ్యాంగులు ప్రత్యేక ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. ఇప్పటికే నిరుద్యోగ భృతి పొందుతున్నవారు, స్వీయ వివరాలతో కూడిన సర్టిఫికెట్లు సమర్పించాలని చెన్నై జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాసాగ్రాండ్ సంస్థ నెక్సస్ కన్సల్టింగ్‌తో కలిసి 'బ్యాటిల్ ఆఫ్ బ్రెయిన్స్' పేరుతో క్విజ్ పోటీలు నిర్వహిస్తోంది. చెన్నైలోని పాఠశాలలు ప్రతిష్ఠాత్మక ట్రోఫీ, ఉత్తేజకరమైన బహుమతుల కోసం పోటీ పడేందుకు 6-9 తరగతులకు చెందిన ఇద్దరేసి చొప్పున జట్లను నమోదు చేసుకోవచ్చు. నగర వ్యాప్తంగా ఈ పోటీలు నవంబరు 5వరకు జరుగుతాయి. పాఠశాలలు, విద్యార్థులు తమ పేర్లను www.casagrand.co.in/bobquizలో నమోదు చేసుకోవచ్చు. దీనిని ప్రఖ్యాత క్విజ్ క్యూరేటర్, నెక్సస్ కన్సల్టింగ్ వ్యవస్థాపకుడు క్విజ్ మాస్టర్ వెంకటేష్ శ్రీనివాసన్ నిర్వహించే ఈ పోటీల్లో ప్రథమ విజేత జట్టుకు రూ.1,5 లక్షలు, రన్నరప్ జట్టుకు రూ.80,000 విలువైన బహుమతి అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

హొగెనేకల్‌లో దోనెల సవారీ నిషేధం

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హొగెనేకల్‌లో వరద ఉధృతి కొనసాగుతుండడంతో దోనెల సవారీ, పర్యాటకుల స్నానాలకు విధించిన నిషేధం కొనసాగుతోంది. ఈశాన్య రుతుపవన వర్షాలతో హొగెనేకల్‌కు 43వేల ఘనపుటడుగుల నీరు వస్తుండడంతో, ఆరు రోజుల క్రితం పడవలు, దోనెల సవారీపై అధికారులు నిషేధం విధించారు. సోమవారం కూడా వరద ఉధృతి కొనసాగుతుండడంతో, ప్రధాన జలపాతం, సినీ ఫాల్స్ ఐందరువి సహా అన్ని జలపాతాల్లో పర్యాటకుల స్నానాలతో పాటు దోనెల సవారీపై విధించిన నిషేధం ఆరవ రోజైన సోమవారం కొనసాగింది.

రైల్వేస్టేషన్‌లో గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్ ఓ ప్రయాణికుడు గుండెపోటుకు గురై మృతిచెందాడు. అయ్యప్పన్‌తాంగళ్‌కు చెందిన నరేష్‌కుమార్ (45) ఆదివారం ఉదయం తిరుప్పూర్ వెళ్లేందుకు సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. రైల్వేస్టేషన్ ప్రవేశ ద్వారం నుంచి లోపలికి వెళ్తున్న నరేష్‌కుమార్, ఒక్కసారిగా గుండెపోటుకు గురై స్పృహతప్పి పడిపోయాడు. చుట్టుపక్కల వారు అతడిని వెంటనే రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై సెంట్రల్ రైల్వేస్టేషన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

టీచర్‌పై దాడి: విద్యార్థిపై కేసు

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): టీచర్‌పై దాడిచేసిన విద్యార్థిపై పోలీసులు కేసు నమోదుచేశారు. సేలం జిల్లా అమరకుంది ప్రాంతానికి చెందిన ముత్తుస్వామి (55) అమరకుంది ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. ఈ నెల 10వ తేది ఇద్దరు ప్లస్ టూ విద్యార్థులు ఘర్షణ పడుతుండడం గమనించిన ముత్తుస్వామి, వారిద్దరికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించాడు. వారిలో ఒక విద్యార్థి తరగతి గదిలోకి వెళ్లగా, మరొక విద్యార్థి ఇంటికెళ్లి తల్లిదండ్రులను పాఠశాలకు తీసుకొచ్చి ఉపాధ్యాయుడితో మాట్లాడించాడు. ఆ సమయంలో, సదరు విద్యార్థి హఠాత్తుగా ఉపాధ్యాయుడు చొక్కా చింపి ముఖంపై దాడిచేశాడు. ఈ వ్యవహారంపై ఉపాధ్యాయుడు ఫిర్యాదుతో, తొలసంపట్టి పోలీసులు, విద్యార్థిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఊటీలో వాటర్ బాటిళ్లు స్వాధీనం

● డ్రైవర్లకు రూ.26,400 జరిమానా

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఊటీలో వాటర్ బాటిల్స్ తీసుకొచ్చిన, పర్యాటక వాహన డ్రైవర్లకు రూ.26,400 జరిమానా విధించారు. నీలగిరి జిల్లాలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా జిల్లా యంత్రాంగం, లీటరు, రెండు లీటర్ల వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్స్ బాటిల్స్ తదితర ప్లాస్టిక్ వస్తువులను నిషేధం విధించింది. జిల్లాకు వచ్చే పర్యాటకుల వాహనాలను చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తున్న అధికారులు, ప్రయాణికులు తీసుకొచ్చే వాటర్, కూల్‌డ్రింక్స్ బాటిల్స్ స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, ఊటీ తహసీల్దార్ శంకర్ గణేష్ నేతృత్వంలోని రెవెన్యూ అధికారుల బృందం బొటానికల్ గార్డెన్ ప్రాంతంలోని పార్కింగ్ చేసిన కేరళ, కర్ణాటక సహా పలు రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటక వాహనాల్లో నిషేధించిన 264 బాటర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని, వాహనాల డ్రైవర్లకు రూ.24,600 జరిమానా విధించారు.

దుబాయ్ విమానంలో సాంకేతికలోపం

● అత్యవసర ల్యాండింగ్

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దుబాయ్ విమానంలో సాంకేతికలోపం తలెత్తడంతో నగరంలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. మదురై నుంచి దుబాయ్‌కు సోమవారం 160 మంది ప్రయాణికులతో విమానం బయల్దేరింది. ఆ విమానంలో హఠాత్తుగా సాంకేతికలోపం ఏర్పడినట్లు పైలెట్ గుర్తించాడు. ఈ విషయాన్ని చెన్నై విమానాశ్రయంలోని కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాడు. అధికారుల అనుమతితో విమానాన్ని చెన్నై విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. విమానం నుంచి ప్రయాణికులను దింపేసి విశ్రాంతి గదులకు తరలించిన అధికారులు, నిపుణుల సాయంతో సాంకేతికలోపం సరిదిద్దే పనులు చేపట్టారు.

రోడ్డు పక్కన దొరికిన నగదు

● పోలీసులకు సమాచారం ఇచ్చిన మహిళ



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, సమాచారం ఇచ్చిన సెల్వరాణి

ప్యారీస్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మదురై సీమక్కల్ ప్రాంతంలో రోడ్డు పక్కన ఓ సంచిలో నగదు ఉండడంతో విద్యార్థిని సహా ఆమె పెద్దమ్మ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీమక్కల్ లాయర్ వీధికి చెందిన సెల్వకుమార్ కుమార్తె రూబిని (17) అదే ప్రాంతంలో ఉన్న మీనాక్షి మహోన్నత పాఠశాలలో ప్లస్ టూ చదువుతోంది. ఆమె ఆదివారం రాత్రి తన పెద్దమ్మ సెల్వరాణితో కలసి సమీపంలో ఉన్న దుకాణానికి నడిచి వెళ్తున్న సమయంలో, రోడ్డు పక్కన గోనె సంచి కనిపించింది. అనుమానంతో సంచి పరిశీలించగా, అందులో రూ.500 నోట్ల కట్టలు ఉండడంతో పోలీసులకు సమాచారం అందించింది. ఆ ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, రూ.17.49 లక్షలు స్వాధీనం చేసుకుని పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా, విద్యార్థిని పోలీసు అధికారులు, పలువురు అభినందించారు.

పంటకాల్వలో ఆమ్నీ బస్సు బోల్తా

● 21 మందికి గాయాలు



చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సమీపంలో సోమవారం వేకువజాము అదుపు తప్పిన ఆమ్నీ బస్సు రహదారి పక్కనే ఉన్న పంట కాల్వలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 21 మంది ప్రయాణికులు గాయపడ్డారు. కుంభకోణం నుండి బెంగళూరుకు డ్రైవర్ సహా 31 మందితో ఆమ్నీ బస్సు ఆదివారం రాత్రి బయల్దేరింది. ఆ బస్సు సోమవారం వేకువజాము ఐదు గంటల ప్రాంతంలో తిరుచ్చి - నామక్కల్ జాతీయ రహదారిలో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పంటకాల్వలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 21 మంది గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వాత్తలై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ఆరోగ్య శిబిరాలకు విశేష స్పందన



చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గోల్డ్ విన్నర్, దీపం, కార్డియా వంటి విశ్వసనీయ గృహ బ్రాండ్ల వెనుక వున్న ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ 'కలిసువారి రిఫైనరీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య శిబిరాలను నిర్వహించింది. మొత్తం తొమ్మిది జిల్లాల్లో 42 శిబిరాలను విజయవంతంగా చేపట్టింది. 2500 మందికి పైగా పాల్గొని వైద్య ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిదులు మాట్లాడుతూ.. ఈ శిబిరాలు ఆరోగ్య సంరక్షణను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడానికి నిర్వహించామని తెలిపారు.

ఆంజనేయ స్వామి విగ్రహానికి పూజలు



పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భారీ ఆంజనేయ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంచీపురం జిల్లా పలవేరి శిల్ప కళాక్షేత్రంలో 160 టన్నుల బరువుతో 36 అడుగుల మేర రూపొందించిన ఆంజనేయ స్వామి విగ్రహన్ని నగరానికి తీసుకురానున్న సందర్భంగా విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. తిరువణ్ణామలై జిల్లా వందవాసి సమీపం కొరకొట్ట ప్రాంతం నుంచి తీసుకొచ్చిన 200 టన్నుల ఒకే రాతిపై 30 మంది శిల్ప కళాకారులు నాలుగు నెలలు శ్రమించి విగ్రహాన్ని తయారుచేశారు. స్థానిక టినగర్‌లోని అయోధ్య మండపంలో ఈ భారీ ఆంజనేయ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.

వైభవంగా పార్వతి సంగమేశ్వరాలయ ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

తిరుత్తణి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పల్లిపట్టులో ప్రసిద్ధిచెందిన పార్వతి సంగమేశ్వరాలయంలో స్కంద షష్ఠి వేడుకలు వైభవంగా జరిగాయి. ముందుగా ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా అభిషేకాలు, అలంకరణ, పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయం తరఫున అన్నదానం చేశారు. ఉత్సవ ఏర్పాట్లు విజయభాస్కర్, ఆనంద కుమార్ కుటుంబ సభ్యులు పర్యవేక్షించారు.

ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థినులు అధికం

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో విద్యార్థుల కంటే విద్యార్థినులు అధికంగా చేరారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పొన్ముడి తెలిపారు. నగరంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ... ఆడపిల్లలను చదివించలేని పరిస్థితులు గతంలో ఉండేవన్నారు. కానీ, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో ద్రావిడ మోడల్ ప్రభుత్వం, బాలికలు ప్రాథమిక విద్యతో పాటు ఉన్నత విద్యలో రాణించేలా పథకాలు అమలుచేస్తోందన్నారు. ఈ కారణంగా ఉన్నత విద్యలో చేరే బాలికల సంఖ్య పెరిగిందని, ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో బాలురు కంటే బాలికలే అధికంగా చేరారని పొన్ముడి తెలిపారు.



సూపర్‌స్టార్ చిత్రంలో బాలీవుడ్ నటి?

సూపర్‌స్టార్ రజనీకాంత్ - యంగ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'జైలర్-2'లో బాలీవుడ్ సీనియర్ నటి విద్యాబాలన్ అతిథి పాత్రలో నటించనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఈ మూవీలో ప్రధాన విలన్‌గా మిథున్ చక్రవర్తి నటిస్తున్నారు. ఆయన కుమార్తెగా విద్యాబాలన్ నటించనున్నట్టు సమాచారం. ఒకపుడు అగ్రనటిగా కొనసాగిన విద్యాబాలన్ తమిళంలో మాత్రం రాణించలేకపోయారు. అయితే, అజిత్ నటించిన 'నేర్కొండ పార్వై' మూవీలో తొలిసారి గెస్ట్ రోల్ పోషించారు. ఆ తర్వాత ఇపుడు రజనీకాంత్ మూవీలో నటిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ కోయంబత్తూరులో శరవేగంగా జరుపుకుంటోంది. వచ్చే యేడాది వేసవిలో విడుదల కానున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత కళానిధి మారన్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న విషయం తెల్సిందే. 'జైలర్'లో నటించిన తారాగణమంతా ఈ చిత్రంలో నటిస్తున్నారు.

'ఆన్ పావం పొల్లాదదు' మహిళల వ్యతిరేక చిత్రం కాదు

● రియోరాజ్


డ్రమ్ స్టిక్ ప్రొడక్షన్ పతాకంపై డైరెక్టర్ కలైయరసన్ తంగవేల్ దర్శకత్వంలో తాను కథానాయకుడిగా నటించిన 'ఆన్ పావం పొల్లాదదు' మహిళలకు వ్యతిరేక మూవీ కాదని హీరో రియోరాజ్ అన్నారు. ఈ నెల 31న చిత్రం విడుదలకానుంది. దీనిని పురస్కరించుకుని హీరో రియోరాజ్ నగరంలో మీడియాతో మాట్లాడుతూ, 'సాధారణంగా మహిళలు ఎదుర్కొనే కష్టాలు ప్రతి ఒక్కరికీ తెలుసు. కానీ, పురుషుల కష్టాలు కూడా తెలిపే చిత్రమే ఇది. వివాహమైన దంపతుల మధ్య ఏర్పడే సమస్యలను పురుషుల వైపు నుంచి చెప్పే ప్రయత్నం చేశాం. ఇది ఒక పక్కా వినోదాత్మక చిత్రమైనప్పటికీ కొన్ని ప్రధాన సమస్యలను వెండితెరపై ఆవిష్కరించాం. మహిళలు పోలీస్ స్టేషన్ గడప తొక్కితే పురుషులు నిందితులుగా చిత్రీకరిస్తున్నారు. మహిళలు కూడా నిందితులే. ఈ విషయాన్నే మేం చెప్పాం. అంతేగానీ, మహిళా వ్యతిరేక చిత్రం కాదు. హీరోయిన్ మాళవికా మనోజ్ చాలా బాగా నటించారు. దర్శకుడు ఏ.వెంకటేష్ ఓ కీలక పాత్ర పోషించారు. నేను ఒక గేయ రచన చేశాను. ఈ సందర్భంగా నా భార్య శృతికి ధన్యవాదాలు. ఈ సినిమా చూసే ప్రతి మహిళకు నచ్చుతుంది. తమ భర్తలపై ప్రేమాభిమానాలు పెరుగుతాయన్నారు. చిత్ర దర్శకుడు కలైయరసన్ మాట్లాడుతూ, 'ఈ సినిమా ప్రారంభించక ముందు అనేక కేసులను స్టడీ చేశాను. పలు ప్రాంతాల్లో పురుషులకు అన్యాయం జరుగుతుంది. దాన్ని వెండితెరపై ఆవిష్కరించాలని స్క్రిప్టు సిద్ధం చేశాను. ఈ సినిమా చూసిన తర్వాత పురుషులపట్ల అభిప్రాయం మారే అవకాశం ఉంది. సెన్సార్ సభ్యులు కూడా ఎక్కడా అభ్యంతరం తెలుపలేదు. 13 యేళ్ళకుపైబడిన వారంతా చూసేలా 'యూఏ' సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ నెల 31వ తేదీన విడుదల చేస్తున్నా' అని వివరించారు.


'ఆన్ పావం పొల్లాదదు'లో రియోరాజ్ - మాళవిక

ఆర్.మాధవన్‌కు రెండున్నర గంటల మేకప్

● 'జి.డి.ఎన్' ఫస్ట్‌లుక్

దేశంలో తొలిసారి ఎలక్ట్రిక్ మోటర్ ఆవిష్కరించిన ప్రముఖ ఇంజనీర్, 'ఎడిషన్ ఆఫ్ ఇండియా'గా గుర్తింపుపొందిన గోపాలస్వామి దురైస్వామి నాయుడు (జీడీ నాయుడు) జీవిత చరిత్రను ప్రముఖ నటుడు ఆర్.మాధవన్ వెండితెరపై ఆవిష్కరించనున్నారు. ఈ సినిమాలో ప్రధాన పాత్ర మాధవన్ పోషిస్తున్నారు. అచ్చం జీడీ నాయుడులా కనిపించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మేకప్ కోసమే ఏకంగా రెండున్నర గంటలు కేటాయిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా రిలీజ్ చేసిన ఫస్ట్‌లుక్‌లో మాధవన్‌ను ఏమాత్రం గుర్తుపట్టలేని విధంగా ఉన్నారు. ఈ మూవీకి 'జీడీఎన్' అనే పేరు ఖరారు చేశారు. కృష్ణకుమార్ రామ్‌కుమార్ దర్శకుడు. గతంలో మాధవన్ నటించిన 'రాకెట్రీ - ది నంబి ఎఫెక్ట్' చిత్రాన్ని నిర్మించిన నిర్మాణ సంస్థలే ఈ మూవీని కూడా నిర్మిస్తున్నాయి. ఈ సినిమా వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'జీడీ నాయుడు పాత్రలో మాధవన్ ఇమిడిపోయారు. ఇతర పాత్రల్లో జయరాం, ప్రియమణి, దుషార విజయన్, తంబి రామయ్య తదితరులు నటిస్తున్నారు. కోయంబత్తూరులో చిత్రీకరణ జరిగింది. వచ్చే యేడాది వేసవిలో సినిమా రిలీజ్ చేస్తాం' అని పేర్కొన్నారు.


'జి.డి.ఎన్'లో ఆర్.మాధవన్

చిత్రజ్యోతి

గేయ రచయిత స్నేహనన్‌కు పితృవియోగం

సినీ గేయరచయిత స్నేహనన్ తండ్రి శివశంకు (102) సోమవారం కన్నుమూశారు. తంజావూరు జిల్లాలోని పుదురాయిపట్టిలోని స్వగృహంలో వయోభారంతో పాటు వృద్ధాప్య సమస్యలతో తదిశ్వాస విడిచినట్టు స్నేహనన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంత్యక్రియలు మంగళవారం నిర్వహించనున్నట్టు తెలిపారు. శివశంకుకు ఏడుగురు కుమారులు, ఒక కుమార్తె. ఎనిమిదో సంతానమే స్నేహనన్. తండ్రిని కోల్పోయి దుఃఖసాగరంలో ఉన్న స్నేహనన్‌కు చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. కాగా కోలీవుడ్ గేయరచయితల్లో ఒకరైన స్నేహనన్ ఇప్పటివరకు 500కుపైగా చిత్రాల్లో రెండు వేలకుపైగా పాటలు రచించారు. అగ్ర నటుడు కమల్ హాసన్ స్థాపించిన మక్కల్ నీది మయ్యం పార్టీలో కీలక బాధ్యత కూడా నిర్వహించారు. గతంలో విరుగంబాక్కం అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎన్ఎం అభ్యర్థిగా పోటీ చేసి పరాజయంపాలయ్యారు.


తన తండ్రితో స్నేహనన్


తండయార్‌పేట జోన్‌లోని కెప్టెన్ కాటన్ కాలువలో పూడిక తీతపనులను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రి కేఎన్ నెహ్రూ, మేయర్ ప్రియ తదితరులు

ఎంత వర్షమొచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధం

● ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చటం, బంగాళా ఖాతంలో వాయుగుండం తదితర కారణాలతో నగరంలో ఎంతటి వర్షాలు కురిసినా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి అన్నారు. సోమవారం ఉదయం జీసీసీ పరిధిలోని తండయార్‌పేట జోన్‌లో జరుగుతున్న పూడికతీత పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. వ్యాసార్పాడి కళాశాల ప్రాంగణం సమీపంలోని బకింగ్‌హామ్ కాలువ వద్ద జరుగుతున్న పూడిక తీత పనులను తనిఖీ చేశారు. ఇదే విధంగా కెప్టెన్ కాటన్ కాలువలో చేపడుతున్న పూడిక తీతపనులను ఆయన తనిఖీ చేశారు. నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ, మేయర్ ప్రియ, ఎంపీ డాక్టర్ కళానిధి వీరాసామి, శాసనసభ్యులు ఆర్డీ శేఖర్, ఆర్. మూర్తి, జేజే ఎబినేజర్, ప్రత్యేక పథకాల అమలు శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌యాదవ్, కార్పొరేషన్ కమిషనర్ జె.కుమారగురుబరన్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధితోపాటు పర్యటించారు.

అలరించిన సురంజన బోస్ సంగీత విభావరి

ప్యారీస్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హిందుస్తానీ సంగీతంలో ప్రత్యేక కీర్తనలు, భజన పాటల ద్వారా ప్రపంచవ్యాప్తంగా సంగీతప్రియులను అలరిస్తున్న విదుషీమణి సురంజన బోస్ హిందుస్తానీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. శాస్త్రీయ కళలను పోషిస్తున్న విశ్వకళా సంగమ ఆధ్వర్యంలో తిరువాన్మియూర్‌లోని కళాక్షేత్ర కళాశాల ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఈ సంగీత కచేరి జరిగింది. సురంజన బోస్ తనదైన శైలిలో 'రాగశ్రీ' రాగంలో 'సబ్‌రంగ్...' అనే పాట, 'పీలుతుమ్రి', 'మాండ్' రాగంలో భజనల్లోని ప్రత్యేక గీతాలు ఆలపించి శ్రోతలను పరవశింపజేశారు. ఆమెకు సందీప్ గుర్మలే (హార్మోనియం), రామ్ కాట్స్ (తబల) వాద్యసహకారం అందించారు. చివరగా కళాకారులను ఊరా ఫౌండేషన్ ట్రస్టీ, విశ్వకళా సంగమ వ్యవస్థాపకులు ఊరా లక్ష్మీనారాయణ జ్ఞాపికలు, టీటీవీ క్యాలెండర్, డైరీలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ సంస్థ 26వ వార్షికోత్సవం సందర్భంగా హిందుస్తానీ సంగీత మాధుర్యాన్ని సంగీత ప్రియులకు అందజేయాలన్న లక్ష్యంతోనే న్యూఢిల్లీలోని ఆలిండియా రేడియో 'ఏ' గ్రేడ్ కళాకారిణి సురంజన బృందంతో కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. డిసెంబరు 19,20,21 తేదీల్లో ఆళ్వార్‌పేట నారద గానసభలో సంగీత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్కేపీడీ మాజీ ట్రస్టీ, ప్రముఖ గాయకులు ఊరా ఆంజనేయులు, కె.శారద తదితరులు పాల్గొన్నారు.




కళాకారులతో విశ్వకళా సంగమ నిర్వాహకులు ఊరా లక్ష్మీనరసింహారావు తదితరులు - భజన గీతాలు ఆలపిస్తున్న సురంజన బోస్


కేక్ మిక్సింగ్‌లో అతిథులు

'కిచీస్ బేక్డ్ డిలైట్స్'లో గ్రాండ్ ఫ్రూట్ మిక్సింగ్

చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కం తిరుమూర్తినగర్ మెయిన్‌రోడ్డులో వున్న 'కిచీస్ బేక్డ్ డిలైట్స్' ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం గ్రాండ్ ఫ్రూట్ మిక్సింగ్ జరిగింది. ఈ వేడుకలో క్రిస్మస్ కేక్ తయారీ సీజన్ ప్రారంభాన్ని సూచించే సాంప్రదాయ ఆచారంలో పాల్గొనడానికి, పండుగ సీజన్ ఉల్లాసమైన ఛాయలను ధరించిన ప్రముఖులు, వినియోగదారులు ఒకచోట చేరారు. అతిథులు ఉత్సాహంగా కిచీస్ బృందంతో కలిసి డ్రైఫ్రూట్స్, సీడ్స్, సుగంధ ద్రవ్యాలను ప్రీమియం స్పిరిట్‌లో ముంచి కలిపారు.


'క్యూబిక్'లో సిద్ధార్థ్ మరో రికార్డు

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన సిద్ధార్థ్ 'క్యూబిక్'లో మరో రికార్డు సృష్టించాడు. సిద్ధార్థ్ ఇప్పటికే 15 జాతీయ, అంతర్జాతీయ రికార్డులు సాధించాడు. తమిళనాడు క్యూబిక్ అసోసియేషన్, ఆలిండియా స్పోర్ట్స్ అండ్ రీక్రియేషనల్ యాక్టివిటీస్ క్లబ్ (ఏఐఎస్ఆర్ఏసీ) సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సిద్ధార్థ్ మరో రికార్డు సాధించాడు. అన్నానగర్ చెన్నై పబ్లిక్ స్కూల్లో చదువుతున్న 15 ఏళ్ల సిద్ధార్థ్ ఇప్పటికే 15 రికార్డులు సాధించాడు. తాజాగా, నిర్వహించిన కార్యక్రమంలో ఒకవైపు తిరుక్కురల్ పఠిస్తూ ఎడమ చేతితో రూబిక్స్ క్యూబ్ చేస్తూ, కుడి చేతితో సీతాకోకచిలుకలా దువ్వెన తిప్పుతూ నిమిషం 14 సెకన్లలో క్యూబిక్స్ చేశాడు. ఈ సాధన ఇంజనీయస్ ఛార్మ్ వరల్డ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ అచీవర్స్ రికార్డ్స్‌లో నమోదయ్యాయి. సిద్ధార్థ్‌ను ఏఐఎస్ఆర్ఏసీ ప్రెసిడెంట్ ఆనంద రాజేంద్రన్ జ్ఞాపిక అందజేసి, రికార్డు సంబంధించిన సర్టిఫికెట్లు అందించారు.


సిద్ధార్థ్‌ను సత్కరిస్తున్న ఆనంద రాజేంద్రన్

తిరుత్తణి ఆలయంలో వైభవంగా పుష్పార్చన

చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్కందషష్టి వేడుకల్లో భాగంగా తిరుత్తణి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామివారికి సోమవారం సాయంత్రం పుష్పార్చన జరిగింది. కుమారస్వామి శూరసంహారం చేసిన అనంతరం అలసి సేద తీరిన దివ్యక్షేత్రమే తిరుత్తణి. కనుక ఈ క్షేత్రంలో శూరసంహారానికి బదులుగా పుష్పార్చన చేయటం ఆనవాయితీ. తిరుచెందూరు వద్ద శూరసంహారం ముగిసిన వెంటనే ఈ పుష్పార్చన, చివరగా మహాదీపారాధన చేశారు. వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ప్రత్యేక పుష్పాలంకరణతో ఇష్టదేవేరులతో కొలువుదీరిన సుబ్రహ్మణ్యస్వామి


శూరసంహార వేడుకల సందర్భంగా సోమవారం బీసెంట్‌నగర్‌లోని అరుపడైవీడు మురుగన్ ఆలయంలో స్వామివారిని దర్శనం చేసుకుంటున్న గవర్నర్ ఆర్ఎన్ రవి దంపతులు

మా బంధం పటిష్ఠం

రాహుల్ ఆప్యాయత అమోఘం: స్టాలిన్

చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు పూర్వం సిద్ధాంతపరంగా వేర్వేరు మార్గాల్లో పయనించినా ప్రస్తుతం దేశ సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం కలిసి ఒకే కూటమిలో కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. మతతత్వపార్టీ బీజేపీకి వ్యతిరేకంగా రెండు పార్టీలూ సమైక్యంగా పోరాడుతున్నాయని చెప్పారు. దేశ సంక్షేమం కోసం పాటుపడటమే రెండు పార్టీల ఆశయమని, ఆ ఆశయ సాధన కోసం నిర్విరామంగా పోరాడుతామఅన్నారు. సోమవారం ఉదయం అరివాలయంలోని కలైంజర్ అరంగంలో జరిగిన విరుదునగర్ ఈస్ట్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శ్రీరాజా చొక్కర్ కుమారుడు శివరాజా శ్రీ రాజా వివాహవేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశ సంక్షేమం కోసం ప్రత్యేకించి దేశసమైక్యత కోసం కాంగ్రెస్, డీఎంకే పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని, కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీ తనపై చూపిస్తున్న ఆదరాభిమానాలను ఎన్నడూ మరువలేనన్నారు. రాహుల్ తనను వ్యక్తిగతంగా కలిసినప్పుడు డియర్ బ్రదర్ అనే సంబోధిస్తారని చెప్పారు. తానింతవరకూ ఏ పార్టీ నాయకులను సోదరుడని సంబోధించలేదని పేర్కొన్నారు. ఇదంతా తాను ఎందుకు చెబుతున్నానంటే పార్టీల సిద్ధాంతాలకు అతీతంగా, కాంగ్రెస్, డీఎంకే మధ్య విడదీయలేని రాజకీయ అనుబంధంతోపాటు, ఆత్మీయ అనుబంధం కూడా పటిష్ఠంగా ఉందని చెప్పడానికేనని స్టాలిన్ అన్నారు. తన సమక్షంలో ఆదర్శవివాహం చేసుకున్న దంపతులు తమకు పుట్టబోయే బిడ్డలకు తమిళ పేర్లు పెట్టాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదర్శవివాహాలు చట్టబద్ధం కాకముందు కాంగ్రెస్ ఈ వివాహాలను పెద్దగా పట్టించుకోలేదని, 1967 తర్వాత రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వివాహాలు చెల్లుబాటు అయ్యేలా కొత్త చట్టమే తీసుకొచ్చారని ఆయన వివరించారు.


వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం


చెన్నైలో వర్షం


పట్టినంబాక్కంలో నిలిచిన పడవలు

రాజధాని నగరంలో సోమవారం కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. మొంథా తుపాను కారణంగా సముద్రంలో అలలు ఎగసిపడ్డాయి. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లలేకపోవడంతో పడవలన్నింటినీ తీరంలో లంగరు వేశారు. మరో పక్క వర్షం కురుస్తున్నా పర్యాటక ప్రాంతం మహాబలిపురంలో పర్యాటకుల సందడి కనిపించింది. - చెన్నై,ఆంధ్రజ్యోతి


పడవల్ని తీరానికి తరలిస్తున్న దృశ్యం


మహాబలిపురంలో వర్షంలోనూ వచ్చిన పర్యాటకులు

పూండి జలాశయం నుంచి అదనపు జలాల విడుదల



ప్యారీస్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రుతుపవనాల వర్షాల కారణంగా పూర్తి సామర్థ్యంతో నిండిన పూండి జలాశయం నుంచి 7వేల ఘనపుటడుగుల అదనపు జలాలు విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. తిరువళ్లూర్ జిల్లాలో ఉన్న ఐదు జలాశయాలు చెన్నై నగరానికి తాగునీరందిస్తున్నాయి. ప్రస్తుతం ఈ జలాశయాలు పూర్తి సామర్థ్యంతో నిండి సముద్రాన్ని తలపిస్తున్నాయి. మరోవైపు ఆంధ్ర రాష్ట్రం కండలేరు డ్యాం నుంచి తెలుగు గంగ కాలువ ద్వారా విడుదల చేస్తున్న కృష్ణా జలాలతో పూండి జలాశయం నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. ఈ జలాశయం ఎత్తు 35 అడుగులు కాగా ప్రస్తుతం 33.27 అడుగుల నీరుంది. జలాశయం పూర్తి సామర్థ్యం 3231 మిలియన్ ఘనపుటడుగులు కాగా, ప్రస్తుతం 2601 మిలియన్ ఘనపుటడుగుల కు చేరింది. ఈ క్రమంలో, రాణిపేట జిల్లా కేశవరం, ఆంధ్ర రాష్ట్రం అమ్మంపల్లి డ్యాంల నుంచి విడుదల చేస్తున్న నీరు పూండి జలాశయానికి చేరుకుంటోంది. ఆదివారం రాత్రి 7 గంటలకు 5720 ఘనపుటడుగుల నీరు వస్తుండగా, సోమవారం 5440 ఘనపుటడుగులకు తగ్గింది. రాబోయే రోజుల్లో భారీవర్షాలు కురుస్తాయనే వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో, డ్యాం భద్రత దృష్ట్యా 7వేల ఘనపుటడుగుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ జిల్లా యంత్రాంగం లౌడ్ స్పీకర్ల ద్వారా హెచ్చరిస్తోంది. వరదల వల్ల ప్రజలకు నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత చర్యలు చేపట్టేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి.


తిరువళ్లూరు జిల్లాలో సిద్ధంగా ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

ఎవరైనా లంచం అడిగితే 1064కు సమాచారం ఇవ్వండి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ పనులకోసం ఎవరైనా లంచం అడిగితే వెంటనే 1064కు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని అవినీతి నిరోదక శాఖ ఏఎస్పీ విమల కుమారి విజ్ఞప్తిచేశారు. విజిలెన్స్ వారోత్స వాల్లో భాగంగా సోమవారం తిరుపతిలోని ఏసీబీ ఆధ్వర్యంలో అవ గాహనా కార్యాక్రమం నిర్వహించారు. ఏసీబీ సిబ్బందిచే అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞచేయించారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థు లకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు.. ర్యాలీలు, సైకిల్ మారథాన్లు నిర్వహిస్తామన్నారు.



కొడాలి నాని, పేర్ని నాని

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.., వైసీపీ మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని, సినీనటులు రాకేష్, సుజాత ఉన్నారు. అంతకుముందు కర్ణా టక శ్రీకూడలి ఆర్య అక్షభ్య మఠాధిపతి రఘువిజ యతీర్థ స్వామిజీ కూడా ఉదయం నైవేద్య విరామ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.



రాకేష్, సుజాత దపంతులు


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెం ట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.90 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,021

తలనీలాలు సమర్పించినవారు: 25,894



ఆర్టీసీ అప్రమత్తం

- ఏసీ బస్సుల కండిషన్‌పై ముమ్మర తనిఖీలు
- వేగ నియంత్రణకూ చర్యలు



అమరావతి ఏసీ బస్సు ఇంజన్‌ను తనిఖీ చేస్తున్న సిబ్బంది



బస్సులో అత్యవసర ద్వారం పరిశీలన

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): 'కర్నూలు' ప్రమాదం నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. బస్సుల కండి షన్‌పై మూడు రోజులుగా తనిఖీలు నిర్వహిస్తు న్నారు. జిల్లా వ్యాప్తంగా 11 డిపోలుండగా మంగళం డిపో ద్వారానే 23ఏసీ బస్సులు నడు స్తున్నాయి. ఈ బస్సులన్నీ కాలపరిమితి ముగి శాయి. నూతన బస్సులు రాకపోవడంతో ఉన్న బస్సులకే ఎప్పటి కప్పుడు విడిభాగాలను మారుస్తూ, రంగులు వేస్తూ నెట్టుకొస్తున్నారు. మొన్నటి వరకు దీన్ని పెద్దగా పట్టించుకోకపో యినా.. ఇప్పుడు అధికారుల్లో ఆందోళన నెల కొంది. దీంతో అన్ని బస్సుల కండిషన్, అదనపు సౌకర్యాలు కల్పించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో మంగళం డిపోలో అమరా వతి, వెన్నెల, ఇంద్రా బస్సుల్లోని విడి భాగాలను తనిఖీ చేస్తున్నారు. బస్సు ముందు, వెనుక రెండు అగ్నినివారణ యంత్రాల ఏర్పాటు, ప్రతి కిటికీ వద్ద సేఫ్టీ హ్యామర్స్ అత్యవసర ద్వారాలు, ఎలక్ట్రిక్ విధానం మెరుగుపరచడం, ఆయిల్ లీకేజీ కాకుండా చర్యలు చేపట్టారు. బ్రేక్స్, స్టీరిం గ్‌ను మరింత సరిచేయడం, డ్రైవర్ల భద్రతకు హెడ్, ఫాగ్, సిగ్నల్స్ లైట్స్, వైపర్స్‌ను నూత నంగా ఏర్పాటు చేయనున్నారు. ఇంజన్ చెక్ చేస్తున్నారు. లాంగ్ సర్వీసుల్లో ఇద్దరు డ్రైవర్లను విధిగా పంపడం, బస్సులో డ్రైవర్ విశ్రాంతికి ప్రత్యేక సీటు ఏర్పాటు, ఓల్వో ట్రైనింగ్ అయిన డ్రైవర్లనే అనుమతించడం, డ్యూటీ ఎక్కేసమ యంలో ప్రతి డ్రైవర్‌ను అప్రమత్తం చేయడం, డ్రైవర్లచే ప్రయాణికులకు రక్షణ ఏర్పాట్లు వంటి వాటిపై అవగాహన కల్పించే చర్యలు తీసుకు న్నారు. అమరావతి బస్సు స్పీడు 90కిలోమీటర్లు, ఇంద్రా, వెన్నెల 80కిలోమీటర్ల వేగాన్ని అధిగ మించకుండా నియంత్రణ చర్యలు చేపట్టారు. ప్రయాణంలో సమయపాలన కచ్చితంగా పాటిం చేలా డ్రైవర్లకు డిపో మేనేజర్ సుధాకర్ కౌన్సె లింగ్ ఇచ్చారు. అలాగే, తిరుమల, రేణిగుంట, మదనపల్లె, కడప, నెల్లూరుకు నడుస్తున్న ఎల క్ట్రిక్ ఏసీ బస్సులలో కూడా చెకింగ్ జరుగుతు న్నాయి. అద్దె బస్సుల యాజమాన్యం కాస్త నిర్ల క్ష్యంగా ఉంటున్నట్లు ఆరోపణలున్నాయి.

370 సప్తగిరి బస్సులతో హైటెన్షన్

2018వ సంవత్సరం ముందు వచ్చిన దాదాపు 370సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సులు ఘాట్‌లో తిరుగు తూ.. వీటి కాల పరిమితి ఆరు లక్షల కిలోమీటర్ల ను అధిగమించాయి. ప్రస్తుతం 9-10లక్షల మధ్య నడుస్తుండటంతో అధికారుల్లో ఆందోళన నెల కొంది. ఇటీవల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో కొన్ని విడిభాగాలు మార్చి..సాంకేతికతను మెరుగు పరి చినా.. మళ్లీ వీటి కండిషన్‌ను తనిఖీ చేస్తున్నారు.

ఇతర బస్సులపైనా ప్రత్యేక దృష్టి : జిల్లా లోని మిగతాపాతబస్సుల కండిషన్, బ్రేక్‌సిస్టమ్, స్టీరింగ్, ఇంజన్, ఇతర భాగాల పనితీరు, లైటిం గ్, ఎలక్ట్రిక్ సిస్టమ్స్‌ను తనిఖీచేసి మరింత మెరు గుపరిచే చర్యలు చేపట్టారు. పూర్తిస్థాయిలో ఫిట్ గా ఉంటేనే రోడ్డెక్కించాలని డీపీటీవో జగదీష్ ఆ యా డిపోమేనేజర్లకు ఆదేశాలు జారీ చేశారు. అద్దెబస్సుల యజమానులతోనూ స మావేశమై వాటి కండిషన్ తనిఖీ చేయించాలని కోరారు.

వేగానికి అదుపేదీ?

- దూసుకెళ్తున్న ప్రైవేటు బస్సులు
- ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు, ఎఫ్‌సీలు
- డొల్ల తనిఖీలతో రోడ్లపై ఫిట్‌లెస్ వాహనాలు
- ఆగని ప్రమాదాలు



రేణిగుంట వద్ద గతేడాది ప్రమాదంలో కాలిన బస్సు (ఫైల్ ఫొటో)

- గతేడాది మే 19న ఓ ట్రావెల్ బస్సుకు రేణిగుంట వద్ద టైర్లు పేలాయి. దాదాపు 10 మంది గాయపడ్డారు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 2న నగరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు బస్సు నుజ్జు నుజ్జు అయింది. ఇద్దరు మృతి చెందగా 10 మంది గాయపడ్డారు.
- ఈ నెల 23న ఉదయం ప్రైవేటు ట్రావెల్ బస్సుకు పెన్నేపల్లి వద్ద మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది.
- ఈ నెల 24న వాకాడు డిపో పల్లె వెలుగు ఆర్టీసీ బస్సుకు తుమ్మూ రులో బ్రేక్ డ్రమ్‌లో నుంచి పొగలు వ్యాపించాయి. డ్రైవర్ అప్ర మత్తతతో ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

జిల్లాలో అడపాదడపా బస్సు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో ప్రైవేట్ బస్సులే ఎక్కువ. సంఘటన జరిగినప్పుడల్లా అధికారులు హడా వుడి చేయడం, తర్వాత మిన్నకుండిపోవడం సాధారణమైపోయింది. తాజాగా కర్నూలులో జరిగిన ఘోర దుర్ఘటనతో అందరూ ఒక్కసారిగా గగుర్పాటుకు గురయ్యారు. ఈ క్రమంలో మన దగ్గర ప్రైవేట్ బస్సుల సామర్థ్యం పరికిస్తే డొల్లతనమే బయటపడుతోంది. కలవరపాటు కలిగి స్తోంది. బాధ్యత వహించాల్సిన రవాణాశాఖ నామమాత్రపు తనిఖీలకే పరి మితమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇతర రాష్ట్రాల్లో ప్రైవేటు బస్సులకు సంవత్సర ట్యాక్సు అతి తక్కువ. దీంతో 80 శాతం ప్రైవేటు ట్రావెల్ బస్సులు మిజోరాం, నాగాలాండ్, అరుణాచలప్రదేశ్, డయ్యూ డామన్ వంటి ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నాయి. తిరుపతి నుంచి దాదాపు 40 నుంచి 50 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు వివిధ ప్రాంతాలకు నడుపుతున్నారు. వీటి సామర్థ్యంపై ఇప్పుడు ఆందోళన వ్యక్తమవుతోంది.

కొంపముంచుతున్న నకిలీ ఎఫ్‌సీలు

ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్న ట్రావెల్స్ యాజమాన్యాలు అక్కడే ఇన్సూరెన్సు, ఎఫ్‌సీలు తీసుకుంటున్నాయి. ట్రావెల్స్ బస్సుకు రెండేళ్ల కొసారి ఎఫ్‌సీ చేసుకోవాలి. తిరుపతి మీదుగా తిరుగుతున్న బస్సులకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రాంతంలో రవాణా శాఖ అధికారులు తనిఖీ చేసి, ధ్రువీకరించాక రాకపోకలు సాగించాలి. అక్కడకు వెళ్లకుండా ఎఫ్‌సీలు తెచ్చుకుంటున్నారని తెలుస్తోంది. దీంతో ఇక్కడి రవాణా శాఖ అధికారులు కూడా వాటికి జోలికి పోవడంలేదు. ఫలితంగానే తరచూ ఏదో ప్రమాదం జరుగుతోందనే వాదన ఉంది. కొన్ని పూర్తిగా పాతవైపోయాయి. నాన్ ఏసీ బస్సులను ఏసీ బస్సులుగా మార్చేటప్పుడు నాణ్యత లేని మెటీరియల్ వాడుతున్నారని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

అడ్డూ అదుపులేని వేగం

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల వేగానికి అడ్డూఅదుపూ లేకుండాపోతోంది. గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతున్నాయి. తిరు పతి నుంచి విజయవాడకు ఆరేడు గంటల్లో దూసుకుపోతున్నాయి. వేగాన్ని నియంత్రించాల్సిన రవాణా శాఖ అధికారులు నెలవారీ మామూళ్లతో సరిపె ట్టుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా వీరు తమ అధికారాలను వినియోగిస్తే వేగంలాంటి అంశాలకు బ్రేకులు పడతాయి.

ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం

జిల్లాలో ప్రైవేట్ బస్‌లను ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. ప్రయాణికుల పరిమితి దాటినా, ఫిట్‌నెస్, ఎఫ్‌సీ, ఇన్సూరెన్సులు లేకుండా రోడ్లపైకి వచ్చినా అపరాధం విధిస్తున్నాం. ఇప్పటివరకు కాంట్రాక్టు క్యారేజీ బస్సులపై 565 కేసులు నమోదు చేశాం. దాదాపు రూ.42.95 లక్షలు జరిమానా కింద వసూలు చేశాం.

- మురళీమోహన్, జిల్లా రవాణా శాఖ అధికారి

తిరుమలలో ముసురు



ఆలయం ముందు కురుస్తున్న జల్లులు

తిరుమల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం తిరుమలలో వేకువజాము నుంచే ముసురు వాతావరణం కని పించింది. చిరుజల్లులే కావడంతో భక్తులకు పెద్దగా అసౌకర్యం కలుగలేదు. ఉండిఉండీ దట్టమైన పొగమంచు తిరుమలను కప్పేస్తోంది. సాయంత్రానికి చలి తీవ్రత పెరిగింది. తుఫాన్ ప్రకటనల నేపథ్యంలో రద్దీ కూడా తక్కువ గానే ఉంది. ఆలయ పరిసరాల్లో భక్తులు పలుచగా కనిపించారు. పదిరోజుల నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తిరుమల ఘాట్‌రోడ్లపై ఫారెస్ట్, ఇంజి నీరింగ్ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. తరుచూ కొండచరియలు విరిగి పడే ప్రాంతాలపై దృష్టి పెట్టారు. అనుకోకుండా కొండరాళ్లు, చెట్లు విరిగిపడితే వెంటనే స్పందించేలా సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఘాట్‌రోడ్లలో నెమ్మ దిగా ప్రయాణించాలని, చెట్ల కింద ఉండకూడదంటూ ప్రకటనలు చేశారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

- 19 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం/నారాయణవనం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు అట వీప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఇద్దరు స్మగ్లర్లను అరెస్టుచేసి 19 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్‌ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఏఆర్‌ఎస్‌ఐ ఈశ్వరరెడ్డి బృందం ఆదివారం కైలాసకోన నుంచి కూంబింగ్ చేపట్టారు. సోమ వారం నారాయణవనం సమీపంలోని సింగారకోన రోడ్డు కన్నికలమ్మ ఆలయం సమీపానికి చేరుకోగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద రీతిలో టాస్క్‌ఫోర్సు పోలీసుల కంటపడ్డారు. టాస్క్‌ఫోర్సు పోలీసులను చూసి పారి పోయేందుకు ప్రయత్నించారు. వారిని పట్టుకుని విచారించగా పరిసర ప్రాంతాల్లో ఎర్రచందనం దుంగలు దాచి ఉంచినట్లు చెప్పారు. వారు దాచిన 19 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని పట్టుబడిన వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిని స్థానికులుగా గుర్తించారు. దుంగలతో పాటు స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒడిశా కార్మికుడి హత్య

చిల్లకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మినపట్నం గ్రామ సమీపంలోని సాగరమాల రోడ్డు నిర్మాణం పనులు చేస్తున్న ఇద్దరు కార్మికుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి హత్యకు దారితీసింది. పోలీసుల తెలి పిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన నరసింగ్ ఓరమ్(28), సమీర్ నాయక్ మండలంలోని తమ్మినపట్నం గ్రామ సమీపంలోని సాగర మాల రోడ్డు నిర్మాణం పనులు చేస్తున్నారు. ఆదివారం రాత్రి మద్యం తాగు తుండగా ఇద్దరి మధ్య వివాదం చోటుచేసుకుని ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో సమీర్‌నాయక్ ఇనుపరాడ్డుతో నరసింగ్ ఓరమ్‌ను కొట్టాడు. అతనికి తీవ్రంగా గాయాలు కావడంతో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం నరసింగ్ ఓరమ్ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సియోల్‌లో శ్రీసిటీ బృందం పర్యటన



కొరియా ప్రతినిధులతో శ్రీసిటీ బృందం

సత్యవేడు, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): విదేశీ పెట్టుబడులు, వ్యాపార విస్తరణలో భాగంగా శ్రీసిటీ మార్కెటింగ్ బృందం కొరియాలో పర్య టిస్తోంది. శ్రీసిటీ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ నేతృత్వంలో సియో ల్‌లోని భారత రాయబార కార్యాలయ డిప్యూ టీ కమిషనర్ చీఫ్ నిషికాంత్ సింగ్, జపాన్ ఉన్నతాధికారులు కలిసి ఆంధ్రప్రదేశ్‌లో పారి శ్రామిక ప్రగతి, 31 దేశాలకు చెందిన 240కు పైగా పరిశ్రమలను ఆకర్షించడంలో శ్రీసిటీ పాత్రను వివరించారు. ఎల్జీ, సోలుమ్, హ్యుం దాయ్, ఇంజనీరింగ్ ప్లాస్టిక్స్ (హెచ్‌డీసీ), ఎస్కే ప్యుకేర్, ఎల్జీ పాలిమర్స్ వంటి ప్రముఖ కొరియన్ కంపెనీలు ఇప్పటికే శ్రీసిటీలో కార్యక లాపాలు నిర్వహిస్తున్నట్లు వారికి వివరిం చారు. అలాగే సియోల్‌లో జరిగిన కొరియాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్ ఐటీ ప్రదర్శన (కేఈఎస్ 2025)ను సందర్శించారు. కొట్రా (కొరియా ట్రేడ్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ ఏజెన్సీ) అధికారులు, ఇతర వ్యాపార ప్రతిని ధులతో వ్యూహాత్మక సమావేశాలు నిర్వహించి, పెట్టుబడి భాగస్వామ్య అవకాశాలను చర్చిం చారు. శ్రీసిటీ వేగవంతమైన పురోగతిని వివ రించిన నిషికాంత్ సింగ్ భవిష్యత్ కొరియా పెట్టుబడులకు తన మద్దతు తెలిపారు. శ్రీసిటీ బృందం సియోల్ పర్యటన శ్రీసిటీ, కొరియన్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని బలపరుస్తుందని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు.



నారద పుష్కరిణిలో ఏర్పాటు చేసిన దీపాలు, దీపాలు వెలిగిస్తున్న ఈవో దంపతులు



శ్రీకాళహస్తిలో లక్ష దీపోత్సవం

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ నారద పుష్కరిణిలో కార్తీక మాసం మొదటి సోమవా రాన్ని పురస్కరించుకుని లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. పుష్కరణి చుట్టూ క్రమపద్ధ తితో నేతిదీపాలను ఆలయాధికారులు సిద్ధం చేశారు. పుష్కరిణి ప్రాంగణంలో స్వామి అమ్మవార్ల చిత్రపటానికి పూజలు చేసి హారతులు సమర్పించారు. అనంతరం ఈవో బాపిరెడ్డి దంపతులు నేతి దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొన్నారు. కార్తీకమాసం తొలి సోమవారం నేపథ్యంలో ముక్కంటి ఆలయా నికి భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు



నిందితులను సెంట్రల్ జైలుకు తరలిస్తున్న పోలీసులు

తిరుపతి (నేరవి భాగం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎర్రచం దనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల చొప్పున జైలు శిక్షతో పాటు రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసిం హమూర్తి సోమవారం తీర్పునిచ్చారు. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాకు చెందిన సుబ్రమణి సతీష్ కుమార్, తిరువణ్ణామలైకి చెందిన కుల్లయన్ వెంక టేష్ ఎర్రచందనం చెట్లను నరికేందుకు తిరుపతి అటవీశాఖ పరిధిలోని పెరు మాళ్లపల్లె, టీఎన్‌పాళెంలోని శేషాచల అడవిలోకి ప్రవేశించారు. వీరిని పట్టు కున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు. వీరిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 లక్షల జరి మానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఇద్దరు స్మగ్లర్లను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ వాదనలు వినిపించారు. ఎర్రచందనం చెట్లను నరికేందుకు అక్రమంగా ప్రవేశించే వారికి.. ఈ తీర్పు ఓ హెచ్చరిక అవుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.

రెండు కిలలో గంజాయి స్వాధీనం

ముగ్గురు నిందితుల అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురిని తిరుపతి పోలీసులు సోమవారం అరెస్టుచేశారు. వారి నుంచి రెండు కిలోల గంజాయి, ఒక స్కూటర్‌ను స్వాధీనం చేసుకు న్నారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. తిరుపతి కోలా వీధికి చెందిన షేక్ సందానీ, చిన్నం చెట్టి బద్రినాథ్, గిరిపురానికి చెందిన ధనుష్ చిన్నప్పటి నుంచి స్నేహితులు. వీరిలో షేక్ సందానీ కొద్దిరోజుల క్రితం వైజాగ్ వెళ్లి కిలో రూ.7500 చొప్పున రెండు కిలోల గంజాయి కొన్నాడు. రైలులో విజ యవాడకు.. అక్కడ్నుంచి బస్సులో రేణిగుంటకు చేరుకున్నాడు. మిగతా ఇద్దరూ స్కూటర్‌లో అక్కడికి చేరుకుని.. గంజాయితో పాటు సందానీని తీసు కుని తిరుపతికి బయలుదేరారు. ఈ గంజాయిని చిన్న పొట్లాలు చేసి, పొట్లం రూ.200 నుంచి, 300కు అమ్మాలన్నది వీరి ఉద్దేశం. దీనిపై అందిన సమాచా రంతో డీఎస్పీ భక్తవత్సలం ఆదేశాల మేరకు సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ హేమాద్రి, సిబ్బంది రామానుజ సర్కిల్ వద్ద కాపుకాసి వారిని పట్టుకున్నారు.



అనుసంధానం చేసేందుకు వ్యాబ్‌కు తరలిస్తున్న సీఎంఎస్-03 ఉపగ్రహం - రాకెట్ మొదటి దశ - రాకెట్ రెండో దశ - రాకెట్ మూడో దశ



రెండో ప్రయోగ వేదికపై ఎల్వీఎం3-ఎం5 రాకెట్

మరో ప్రయోగానికి షార్ సిద్ధం

మరో ప్రయోగానికి షార్‌లోని రెండో ప్రయోగ వేదిక సిద్ధమైంది. ఇస్రో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 4,400 కిలోల బరువైన సీఎంఎస్-03 (జీశాట్-7ఆర్) కమ్యూ నికేషన్ ఉపగ్రహాన్ని ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపేందుకు శాస్త్రవే త్తలు సర్వం సిద్ధం చేశారు. వ్యాబ్‌లో రాకెట్ అనుసంధాన పనులు పూర్తి చేసి రాకెట్‌ను ప్రయోగ వేదికకు తరలించారు. సోమవారం లెవల్ 1, లెవల్ 2 తనిఖీలు చేసి పలు పరీ క్షలు చేశారు. కాగా, రాకెట్‌ను దశలవారీగా అనుసంధానించిన ఫొటోలను ఇస్రో సోమ వారం విడుదల చేసింది.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



వ్యాబ్ నుంచి రాకెట్‌ను ప్రయోగ వేదికకు తరలిస్తున్న దృశ్యం